క్లుప్తంగా

పిడుగురాళ్ల ఎంఈవోగా 'అట్లూరి' బాధ్యతలు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల నూతన విద్యాశాఖాధికారిగా అట్లూరి శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో విధులకు హాజరయ్యారు. మాచవరం మండలంలోని పిల్లుట్ల గ్రామంలోని ఎయిడెడ్ స్కూల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తూ పిడుగురాళ్ల మండల విద్యాశాఖాధికారిగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఆదేశాలు రావడంతో విధులకు హాజరయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో ఓ రాజు ఇటీవలే రిటైరయ్యారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాలతో ఎంఈవోగా అట్లూరి శ్రీనివాసరెడ్డి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది నూతన ఎంఈవో శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గంధాభిషేకం



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసి ఉన్న నాగుల గుడిలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. వివాహానికి ముందు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఫాల్గుణ శుద్ధ షష్ఠి, కృత్తిక నక్షత్రం సందర్భంగా 21 కిలోల గంధంతో విశేషాలంకరణ నిర్వహించారు. సాయంత్రం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్లకు అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు అందించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

దాచేపల్లి : మండలంలోని గామాలపాడు, కాట్రపాడు, కొత్తూరు, మాదినపాడు, పొందుగల, రామాపురం, శ్రీనగర్, ఇరికేపల్లి, భట్రుపాలెం, తంగెడ, గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.సూర్యప్రకాష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు ఆధ్వర్యంలో 53 మంది అధికారులు, 159 మంది సిబ్బంది 53 బృందాలుగా ఏర్పడి 4683 సర్వీస్‌లను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 118 మంది నుంచి రూ.7.71 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డీఈఈలు కె.వీరేశ్వరరావు, ఎం.రవికుమార్, కె.రవికుమార్, ఏఈలు దండ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి

సీఐ బాలకృష్ణ



గురజాల : ఓటర్లు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పట్టణ సీఐ బాలకృష్ణ సూచించారు. మండల పరిధిలోని అంబాపురం గ్రామంలో కేంద్ర బలగాలతో పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ పల్లపురాజు ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వేసుకోవాలన్నారు. ప్రశాంతమైన పల్లెల్లో ఎటువంటి ఘటనలు జరగకుండా ఎన్నికల సమయంలో గట్టి బందోబస్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

గురజాల : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో గల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. పరీక్షల సమయంలో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలని కేవలం పరీక్షలపై దృష్టి సారించాలని మరే విషయాల గురించి ఆలోచన వద్దన్నారు. పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సంస్కరణలకు ఆద్యుడు సీఎం జగన్

- ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు, రూపురేఖలు మార్చిన ఘనత ఆయన సొంతం
- రాబోవు ఎన్నికలలో నరసరావుపేట పార్లమెంట్ సీటుతో పాటు ఏడు అసెంబ్లీ సీట్లను గెలవడం ఖాయం
- పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పిన ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: గడిచిన 58 నెలల కాలంలో దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి ఎన్నో సంస్కరణలను చేపట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సొంతమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పోలేపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి మచ్చుకైనా కనపడదని విమర్శించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన జగన్ కోట్ల రూపాయలతో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి పౌర సేవలను ప్రజలకు చేరువ చేశారన్నారు. కరోనా కష్టకాలం అధిగమించి ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం ప్రతి హామీని నెరవేర్చిన ఘనత మన ప్రభుత్వానికి చెందుతుందన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయలను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేశారన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలల రూపురేఖలు మార్చి ప్రజలకు చేరువ చేశారన్నారు. దశాబ్దాల కల వరికపూడిశెల ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో అనుమతి తెచ్చి పనులు ప్రారంభించటంతో ఈ ప్రాంత రైతాంగం కల నెరవేరనుందని తెలిపారు. రాబోవు ఎన్నికలలో నరసరావుపేట పార్లమెంట్ సీటుతో పాటు ఏడు అసెంబ్లీ సీట్లను క్లీన్ స్వీప్ చేయబోతున్నామన్నారు. సర్పంచ్ దేశం శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్వాయి అంజిరెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



పార్టీలో చేరిన వారితో యూత్ ఉపాధ్యక్షులు పీవీఆర్

దుర్గి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అడిగొప్పలలోని టీడీపీకి చెందిన నాలుగు కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరటంతో పీవీఆర్ వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 85 శాతం నుంచి 90% గడపలకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై టీడీపీని వీడుతున్నారన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి క్యాలెండర్ ప్రకారం ఆయా పథకాల లబ్ధిని నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాలలో వేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారు నూకల నరసింహారావు, నూకల లక్ష్మయ్య, నూకల మహేష్, నూకల కోటేశ్వరరావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిన అల్లయ్య, పిడుగు శివకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి



అనారోగ్యంతో ఉన్న చిన్నారులకు పౌష్టికాహార కిట్లు అందిస్తున్న వైద్యురాలు ప్రభావతి

పిడుగురాళ్ల: పౌష్టికాహారంతో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ప్రభుత్వ వైద్యురాలు ప్రభావతి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో అనారోగ్యంతో ఉన్న చిన్నారులకు పౌష్టికాహారాన్ని శుక్రవారం అందించారు. వైఆర్‌జీ కేర్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కొల్లోజు పాండురంగాచారి ఆర్థిక సహాయంతో సుమారు 30 మంది అనారోగ్యంతో ఉన్న చిన్నారులకు పౌష్టికాహార కిట్‌లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ వైద్యురాలు ప్రభావతి హాజరై చిన్నారులకు పౌష్టికాహార కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణలేని అనారోగ్యంతో ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఆరోగ్యం కోసం వైఆర్‌జీ కేర్ ఎడ్యుకేషన్ ఆర్గనేజేషన్ సంస్థ కృషి అభినందనీయం అన్నారు. అనారోగ్యంతో ఉన్న చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉంచాలన్న సంకల్పంతో విధులు నిర్వహిస్తున్న సంస్థ చైల్డ్ కేర్ ఫెసిలిటేటర్ షేక్ జాన్‌బీని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైఆర్‌జీ కేర్ ఆర్గనైజేషన్ సీఈఎఫ్ షేక్ జాన్‌బీ, డోనర్ కొల్లోజు పాండురంగాచారి, కొమ్మా మహేష్, కొల్లోజు వేణు, ప్రసాద్, షేక్ మస్తాన్ వలి, వైద్య సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డులను వంద శాతం పంపిణీ చేయాలి



సమావేశంలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది, క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందజేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు ఆరోగ్య శ్రీ కార్డులను నూరు శాతం పంపిణీ చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 గ్రామాలకు సంబంధించి మొత్తం 10,448 ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 80 శాతం మాత్రమే అందజేయడం జరిగిందన్నారు. మిగిలిన వాటిలో మృతి చెందిన వారు, పేర్లు, చిరునామాలు తప్పుగా వచ్చినవారు 12 శాతం మంది ఉన్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నూతన ఆరోగ్య శ్రీ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను తొలగించి సహకరించాలి

ఎంపీడీవో శంకర్‌రావు



రెంటచింతల: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్ ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, కటౌట్‌లను వివిధ రాజకీయ పార్టీలు, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు వెంటనే తొలగించి అధికారులకు సహకరించాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు కోరారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో వీటి అమలుకు అవసరమైన సిబ్బందిని నియామకం చేసుకుని వారికి ప్రవర్తనా నియమావళిపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈసీఐ వారు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే కమిషన్ సూచించిన ప్రకారం 72 గంటలలో చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్తులను, బహిరంగ స్థలాలను దుర్వినియోగం చేయడం, అనధికార రాజకీయ ప్రకటనలు, వాల్‌పోస్టర్లు, కటౌట్, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలను తదితర పబ్లిక్ ఆస్తుల వద్ద రైల్వేస్టేషన్ వంటి బహిరంగ ప్రదేశంలో, బస్‌స్టాండ్లు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, స్థానిక సంస్థల భవనాలపై ఉన్నవాటిని కమిషన్ ఎన్నికల ప్రకటన నుంచి 48 గంటలలో కచ్చితంగా తొలగించాలని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి సక్రమంగా అమలుచేసి సాధారణ ఎన్నికలు–2024 ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



విజయపురిసౌత్: మాచర్ల మండలం ఎత్తిపోతలలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్ష సామగ్రి అందజేశారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం పరీక్ష సామగ్రి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మరనాత వెల్లటూరు యేసయ్య సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.దుర్గాభవాని, వార్డెన్ టి.వెంకటేశ్వర్లు, మాచర్ల, విజయపురిసౌత్ వార్డెన్‌లు రామ్మోహన్‌రావు, యేసయ్య, ఉపాధ్యాయినులు నాగమలేశ్వరి, ఎలిజిబెత్ రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజనులను అధికారంలోకి తీసుకొచ్చింది కాన్షీరాం



కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ఓట్లు మావే సీట్లు మావే అనే నినాదంతో బహుజనులను అధికారంలోకి తీసుకొచ్చిన ఘనత ఒక్క కాన్షీరాంకే దక్కిందని బీసీ సంఘ నాయకుడు చింకా అంకమ్మరావు అన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో హోమ్ సెంటర్‌లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షిరామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ కుల వ్యవస్థను అంతం చేయడానికి నడిచిన నాయకుడని, అణచివేతకు గురవుతున్న వారందరు హక్కుల కోసం పోరాడటానికి ఒక వేదికను సృష్టించాడన్నారు. భారత దేశంలోని కుల వ్యవస్థ మీద అవగాహన కల్పించిన గొప్ప సామాజికవాది అని కొనియాడారు. కాన్షీరాం తన జీవితమంతా వెనుకబడిన తరగతులను అధికారంలోకి తీసుకురావడానికి అంకితం చేశారన్నారు. ఒక ఓటు, ఒక నోటు అనే నినాదంతో ప్రజల దగ్గరకు వెళ్లి వారి డబ్బుతోనే ప్రచారం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు గుంటూరు గోవిందు, పోతుల ప్రకాష్ రావు, కె.దస్తగిరి, చావల వెంకటేశ్వర్లు, గుంజి విజయ్‌కుమార్, క్యాలిబర్ జానీ, పత్తిపాటి హరికృష్ణ, పులహరి బానోజీ, పిక్కిలి శివ, అమరేశ్వరపు శ్రీనివాస్, షేక్ చిన్న షరీఫ్, తొరటి వెంకట్రావు, పిల్లకత్తుపుల నాగేశ్వరరావు, సీహెచ్ రమణయ్య, శిరసాల అక్కయ్య, నర్రా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలి

ఏఎస్‌డబ్ల్యూవో సుజాతకుమారి



గురజాల : విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడిని జయించి ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలని ఏఎస్‌డబ్ల్యూవో సుజాత కుమారి అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, గడియారాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో పదవ తరగతి ఎంతో కీలకమన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో వసతులు కల్పించడం జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకుని మంచి ప్రతిభ కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రెంటచింతల, గురజాల, పిడుగురాళ్ల, మాచర్ల, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం వార్డెన్లు నూరుల్ల బేగం, జె.అరుణకుమారి, పి.సుమని, ఎస్.గోపాల్ నాయక్, సాంబశివరావు, శిరోమణి, మాధవీలత తదితరులున్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

విజయపురిసౌత్: స్థానిక జమియతుల్ ఫిర్దోస్ మజీద్‌లో వైఎస్సార్‌సీపీ మాచర్ల మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు ముస్లిం సోదరులకు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా బూడిద శ్రీను మాట్లాడుతూ గత ఏడాది ప్రభుత్వం శ్మశానవాటిక ప్రహరీగోడ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు కేటాయించింది. కేటాయించిన నిధులతో ప్రహరీగోడ నిర్మించగా ఇంకా 50 మీటర్ల మేర గోడ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. శ్మశానవాటికలో 50 మీటర్ల మేర నిర్మించాల్సిన ప్రహరీ గోడతో పాటు చేపట్టాల్సిన మట్టి పనులకు రూ.1.60 లక్షల తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని శ్రీను హామీనిచ్చారు. ముస్లిం సోదరుల చిరకాల వాంఛ అయిన షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వ విప్ పీఆర్కే ఆదేశాలతో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తానని హామీనిచ్చారు. ముస్లిం సోదరులు సంతోషం వ్యక్తం చేస్తూ బూడిద శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు రహంతుల్లా, ఎస్‌కే మస్తాన్, అన్వర్, ఎస్‌కే మస్తాన్‌వలి, బాబుమియా, ఎస్‌కే మహమ్మద్ బాషా, ఎస్‌కే వినయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

ముప్పాళ్ళ: మండలంలోని నార్నెపాడుకు చెందిన వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన షేక్ గౌసియా(33) మైగ్రేన్ తలనొప్పిని భరించలేక అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు సత్తెనపల్లిలోని ప్రయివేటు వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు.

అక్రమ మద్యం కలిగిన వ్యక్తి అరెస్ట్



నిందితుడ్ని పట్టుకున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది

మాచర్ల: మాచర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ కిషోర్, సిబ్బందితో కలిసి జమ్మలమడక రహదారిలో బొంబాయి బ్రిడ్జి వద్ద 10 బీరు బాటిళ్లు, బ్రిటీష్ బీర్లు 10 స్వాధీన పర్చుకున్నారు. మొత్తం 20 బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్నట్లు సీఐ కిషోర్ తెలిపారు. జమ్మలమడక ప్రాంతానికి చెందిన పులి మల్లిఖార్జునరావు అక్రమంగా ఈ మద్యాన్ని తీసుకెళ్తుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్స్‌పెక్టర్ పేర్కొన్నారు. ఈ దాడిలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నిందితుడిని కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రాణదాత సీఎం జగన్

- పేద కుటుంబాల కోసం కోట్లు కేటాయిస్తున్న సీఎం జగన్
- ప్రభుత్వ విప్ పీఆర్కే



చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే



చెక్కులు అందజేస్తున్న పీవీఆర్

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని రూ.25 లక్షలకు ఆరోగ్య శ్రీ కేటాయించటంతో పాటు, ఆరోగ్య శ్రీ పొందలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నిధులందించటం ఎంతో అద్భుతమైన కార్యక్రమమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్ కార్యాలయంలో 22 మందికి పీఆర్కే, పీవీఆర్‌ల చేతుల మీదుగా రూ.14.37 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏనాడూ ప్రజల ఆరోగ్యం గురించి ప్రతిపక్షాలు పట్టించుకోలేదన్నారు. ఆరోగ్య శ్రీని రూ.25 లక్షలకు పెంచటంతో పాటు అనారోగ్యానికి గురై ఇబ్బంది పడుతున్న వారికి సీఎం సహాయ నిధి నుంచి కోట్ల రూపాయలు అందించటం జరుగుతుందన్నారు. ఇటువంటి ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేదని వారు చెప్పారు. స్వర్గీయ వైఎస్సార్ బాటలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి కొనసాగుతూ ఉచిత వైద్య సౌకర్యం ప్రతి ఒక్కరికీ కల్పించి పేదల ప్రాణదాతగా మారారని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు, పలు గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారుల కుటుంబాల వారు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎంపీపీ సంపూర్ణమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ

రెంటచింతల: జీవితంలో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు రాయనున్న 10వ తరగతి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినుల విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఒక లక్ష్యంతో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఒక ప్రణాళిక ప్రకారం చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం ప్రభావతి చారిటబుల్ ట్రస్ట్ వారు అందజేసిన ప్యాడ్‌లు, కిట్లను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు పి.పాలేస్, ఏఎస్‌డబ్ల్యూవో గురజాల సుజాతకుమారితో కలిసి అందచేశారు. ఈ కార్యక్రమంలో వార్డెన్‌లు నూరెల్లాబేగ్, జె.అరుణకుమారి, ఎన్.గోపాల్ నాయక్, ఎం.సాంబశివరావు, మాధవీలత, శిరోమణి, సుమని తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా



కోడూరి వరప్రసాద్‌ను సన్మానిస్తున్న పుర ప్రముఖులు

పిడుగురాళ్ల: ఆర్యవైశ్యుల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కోడూరి వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని శుక్రవారం తన కార్యాలయంలో పుర ప్రముఖులు హాజరై అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కెర శ్రీను, జూలకంటి శ్రీనివాసరావు, గర్రె నాగేశ్వరరావు, మాదాల కిరణ్ కుమార్, జోగిపర్తి సుజాత, జోగిపర్తి ముక్కంటి, కొత్త తులసి సౌజన్య, కొత్త పుష్పలత, ఆర్యవైశ్య నాయకులు ఆతుకూరి శ్రీధర్, బీసీ నాయకులు దాదినబోయిన ఏడుకొండలు, రెడ్డి వాసు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలో కందుల కొనుగోళ్ల పరిశీలన



ఆర్‌బీకేలో కందుల కొనుగోలును పరిశీలిస్తున్న దృశ్యం

కారెంపూడి: మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో కందుల కొనుగోళ్ల తీరును పల్నాడు జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ శుక్రవారం పరిశీలించారు. క్వింటాకు రూ.9,670 ధర రైతులకు చెల్లిస్తున్నామని పంట అమ్మిన మరుసటి రోజే రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి తెలిపారు. మద్దతు ధర కంటే రెండు వేలకు పైగా ఎక్కువ ధర రైతులకు లభిస్తోందని ఏవో వివరించారు. ట్రైనీ కలెక్టర్ కందుల నాణ్యతను, ప్రొక్యూర్‌మెంట్ తీరును పరిశీలించారు. ఇప్పటికి మండలంలో ఆర్‌బీకేల ద్వారా 2,600 క్వింటాళ్ల కొనుగోలు చేశామన్నారు. అంతకు ముందు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.4 లక్షల వ్యయంతో కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటును ట్రైనీ కలెక్టర్ ప్రారంభించారు. సుమారు వెయ్యి మంది విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించడానికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన కోరమాండల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. వ్యాపార సంస్థలు వ్యాపారంతో పాటు సేవా కార్యక్రమాలు కూడా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళి, తహసీల్దార్ జయవర్ధన్, డీటీ కీర్తి సుధాస్రవంతి, హెచ్ఎం అనంతశివ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గోపి, కోరమాండల్ వివిధ హోదాల ప్రతినిధులు, జెడ్ఎం సురేష్‌బాబు, షణ్ముఖ్, సాంబశివరావు, జాకీర్ హుస్సేన్, జానకిరామ్ పాల్గొన్నారు.